క్లుప్తంగా

స్లీపర్ బస్సులను ప్రారంభించిన మంత్రి



చిలకలూరిపేటటౌన్: సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లో ప్రయణించాలని మంత్రి విడదల రజిని సూచించారు. చిలకలూరిపేట ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణంలో సోమవారం నూతనంగా రెండు నాన్ ఏసీ స్లీపర్ బస్సులను ఆమె ప్రారంభించారు. అధునాతన సదుపాయాలు, వసతులతో ఆర్టీసీ తీసుకువచ్చిన ఈ బస్సులు ప్రయాణికుల ఆదరణ పొందుతాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, ఆర్టీసీ రీజినల్ ఆఫీసర్ ఎస్ వీ శ్రీనివాసరావు, జోన్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆదాం సాహెబ్, డిపో మేనేజర్ ఎస్ రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పనులు పారదర్శకంగా ఉండాలి

శావల్యాపురం: నాడు–నేడు మనబడి పథకం పనులు పారదర్శకంగా జరిగేలా క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం మండలంలోని మతుకుమల్లి గ్రామం ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్కూలును సందర్శించి నాడు–నేడు పనులు పరిశీలించారు.

కేవీ ప్రిన్సిపల్ బదిలీ

నాదెండ్ల: గణపవరం కేంద్రియ విద్యాలయలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సాతులూరి విజయ్‌కుమార్ డిప్యూటేషన్‌పై కందుకూరు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా హైదరాబాద్ నుంచి సుభాషిణిని నియమించారు. విజయ్‌కుమార్ మంగళవారం రిలీవ్ కానున్నారు.

మహిళపై దాడి కేసులో జైలు

వినుకొండ టౌన్: మహిళపై దాడి చేసిన కేసులో ముద్దాయికి జైలు శిక్ష, జరిమానా విధించడం జరిగిందని ప్రాసిక్యూషన్ నిర్వహించిన ఏపీపీ దండే వెంకటేశ్వర్లు సోమవారం పేర్కొన్నారు. వినుకొండ రూరల్ బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన దేశిరెడ్డి పద్మావతిని, అన్నయ్య వరసైన భవనం చిన్న వెంకటేశ్వరరెడ్డికి సంబంధించిన పొలాల విషయంలో వివాదాల కారణంగా, పద్మావతిని రాయితో తలపై కొట్టి గాయపరచడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించిన కారణంగా 2016 మే 25న వినుకొండ పోలీస్ స్టేషన్‌లో అప్పటి ఎస్‌ఐ ఎం. లక్ష్మీనారాయణ రెడ్డి కేసు దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయడం జరిగిందన్నారు. కాగా కేసు నిరూపణ కావడంతో న్యాయమూర్తి సదరు ముద్దాయికి 6 నెలలు జైలు శిక్షతోపాటు 6 వేల రూపాయల జరిమానాను విధించడం జరిగిందన్నారు.

నేడు యడ్లపాడులో ప్రజావేదిక

యడ్లపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీలపై 15 విడత ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం జరగనుంది. మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు మధ్య కాలంలో యడ్లపాడు మండలంలో చేపట్టిన ఉపాధి పనుల నిర్వహణ, ఆయా పనులకు వేతనదారులకు చెల్లించిన కూలీ, మెటీరియల్, అలాగే సామాజిక తనిఖీ బృందాలు పరిశీలనలో గుర్తించిన అంశాలను ఈ బహిరంగ సమావేశాల్లో చర్చించనున్నారు.

ఏ ఊరివాడో?

చిలకలూరిపేటటౌన్: ఫిట్స్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమ వారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని విజయబ్యాంకు సమీపంలో ఆదివారం రాత్రి ఫిట్స్‌తో గుర్తుతెలియని వ్యక్తి పడిపోయాడు. గమనించిన స్థానికులకు అతన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి గురించి వివరాలు తెలిసిన వారు పట్టణ పోలీసులకు తెలియజేయాలని అర్బన్ సీఐ రాజేశ్వరరావు కోరారు.

అదుపు తప్పి... బోల్తా కొట్టి..

యడ్లపాడు: ప్రమాదవశాత్తు అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు వైపు వెళ్తున్న తెలంగాణ రిజిస్ట్రేషన్ లారీ యడ్లపాడు మండలంలోని బోయపాలెం వద్దకు రాగానే అండర్‌పాస్ సమీపంలోని కటింగ్ వద్ద అదుపుతప్పింది. దీంతో 16వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గాల్లోకి ఎగిరి పల్టీ కొట్టింది. ఆ సమయంలో సమీపంలో ఎలాంటి వాహనాలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీ ధ్వంసం కాగా, అందులోని డ్రైవర్‌కు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన డ్రైవర్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

జాలాది వీఆర్వోకి పదవి

యడ్లపాడు: గ్రామ రెవెన్యూ అధికారులు రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీగా యడ్లపాడుకు మండల జాలాది వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కేపీ చారి ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ కృష్ణా జిల్లాలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గ్రామ రెవెన్యూ అధికారులు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరిగాయి. అన్ని జిల్లాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చారి తహసీల్దార్ ఎస్ నాగమల్లేశ్వరరావును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా రాష్ట్రపదవికి ఎంపికై న చారిని తహసీల్దార్‌తో పాటు సహుద్యోగులు అభినందనలు తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా జగనన్న పాలన

- పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు
- వైద్య ఆరోగ్యశాఖమంత్రి విడదల రజని



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి జగనన్న పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన కొనసాగుతోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని చెప్పారు. పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం పట్టణంలోని 19వ వార్డు ఉర్దు స్కూల్ వద్ద నుంచి నిర్వహించారు. మంత్రి విడదల రజని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు.

కార్యక్రమంలో మునిసిఫల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు కౌన్సిలర్ నసిమా బేగం, బేరింగ్ మౌలాలి, సొసైటీ చైర్మన్ కొండవీటి ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, సయ్యద్ బషీర్ మేస్త్రి, అలి పఠాన్ మస్తాన్‌వలి, తాళ్ల అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు పట్టణానికి చెందిన అప్పరాజు వెంకటనారాయణ, వల్లీదేవి దంపతులు రూ.1,00,116లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యాలయంలో ఈఓ టి.సుధాకరరెడ్డిని కలిసి విరాళం చెక్‌ను దాత వెంకటనారాయణ దంపతులు అందించారు. అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణంకు దాతలు విరాళాలు అందజేసి సహకరించాలని ఈఓ సుధాకరరెడ్డి కోరారు. విరాళం ఇచ్చే దాతలకు ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుందని తెలిపారు.

యజ్ఞంలా కొనసాగుతున్న జగనన్న సురక్ష

- లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువపత్రాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు



లబ్ధిదారులకు రేషన్, ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నాదెండ్ల: ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కార మార్గాలు చూపుతూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి అని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. సాతులూరు సచివాలయం–2 పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. సచివాలయం–2 పరిధిలో 1371 గృహాలకు గాను వలంటీర్లు, గృహ సారధులు, సచివాలయ సిబ్బంది గత నెల 24 నుంచి నెల చివరి వరకూ సర్వే నిర్వహించగా, 807 గృహాలను సందర్శించారు. వీరిలో సుమారు 356 మందికి ధ్రువపత్రాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెలాఖరు వరకు ఎలాంటి ధ్రువపత్రాలు తీసుకున్నా ఉచితంగానే ఎలాంటి రుసుము లేకుండా అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం గతంలో 11 ధ్రువపత్రాలు అందించేందుకు సిద్ధం చేసి, ప్రస్తుతం 21 రకాల ధ్రువపత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, తహసీల్దార్ ఏవీ రమణ, వ్యవసాయాధికారి హరిప్రసాద్, పార్టీ నాయకుల చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో నాదెండ్ల, గణపవరం సొసైటీల అధ్యక్షులు మంగు ఏడుకొండలు, కురుకుంట్ల వెంకటరెడ్డి, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, ఉడతా వెంకటేశ్వర రావు, దండా రాము, వలేటి హరిబాబు, మండపాటి బాబు, గర్నెపూడి ప్రభాకర్, నారాయణ, బోరుగడ్డ రత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, రమేష్, వీఆర్వోలు మురళీ, అంజలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, డీటీ అనూరాధ, ఆర్‌ఐ షేక్ రమీజా పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు: జగనన్న సురక్ష లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఎంపీడీవో రంగనాయకులు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ల, పెదకొండాయపాలెం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ధ్రువీకరణ పత్రాల కొరకు ఆఫీస్‌ల చుట్టూ తిరిగి విసుగు చెందిన వారికి ఈ కార్యక్రమం వరం లాంటిదన్నారు. ఎలాంటి దరఖాస్తులైనా పరిశీలించి వారికి ధ్రువీకరణ పత్రాలను అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, సర్పంచ్ వెంకట్రావు, బుచ్చయ్య, గోనుగుంట్ల వెంకటహనుమయ్య, ఇనిమెళ్ల సర్పంచ్ తాడిపత్రి మార్తమ్మ, అబ్బులు పాల్గొన్నారు.

చీకటీగలపాలెంలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని చీకటీగలపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని పరిష్కారం కాని సమస్యలను ప్రజలు పరిష్కరించుకోవాలన్నారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలను పొందేందుకు వలంటీర్ల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మోహన్‌చంద్, మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో...

నరసరావుపేట: ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం 31వ వార్డు సచివాలయం వద్ద మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 31వ వార్డులో రూ.9.1 కోట్లతో సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారులకు అందజేశామని, రూ. 68 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. సచివాలయ పరిధిలో మంజూరైన రేషన్ కార్డులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ డి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, కురుగుంట్ల కోటిరెడ్డి, వేముల శివ, వార్డు నాయకులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో...

యడ్లపాడు: పేదల సంక్షేమానికి మరింత భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. మండలంలోని తిమ్మాపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన ఈ గ్రామసభలో జగనన్న సురక్ష కార్యక్రమ ఉద్దేశం, అలాగే వాటి ప్రయోజనాలను అతిథులు వివరించారు. అనంతరం కుల, ఆదాయ, రేషన్, ఆధార్ తదితర ధృవీకరణ పత్రాలకు సంబంధించిన సమస్యల్ని పరిష్కరిస్తూ 351 మందికి వాటిని పంపిణీ చేశారు. అనంతరం 85 కౌలురైతు కార్డులను 85, వందశాతం సబ్సిడీపై కంది విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వై హనుమారెడి పాల్గొన్నారు.

రేషన్ కార్డులో మార్పులు చేశారు



మాది పేద కుటుంబం, కూలిపనులు చేసుకుని జీవిస్తున్నాం. మా అత్తమామలు, మా కుటుంబ సభ్యులం ఒకే రేషన్‌కార్డులో సభ్యులుగా ఉన్నాం. మా మామగారైన రాములు గతించారు. డెత్ సర్టిఫికెట్ లేకపోవటంతో మా అత్త గారైన కోటమ్మకు వితంతు పింఛను రాలేదు. ప్రస్తుతం మా రేషన్ కార్డులో నుంచి మా అత్తయ్య పేరును తొలగించి ప్రత్యేకంగా నా భర్త, మా పిల్లలతో మరో కార్డు ఇచ్చారు. దీంతో మా అత్తకు పింఛను పొందేందుకు అర్హత కలిగింది.

– రేకనారు మాధవి, సాతులూరు

కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలిచ్చారు



ఇటీవల వలంటీర్లు మా ఇంటికి వచ్చారు. మాకు అవసరమైన ధ్రువపత్రాల గురించి అడిగారు. మా పిల్లలు చదువుకునేందుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలని కోరాం. ఈ నెల 8న నమోదు చేయించారు. ఎలాంటి రుసుము లేకుండా అందించారు.

– ఆర్ భవాని, సాతులూరు

రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు ఇచ్చారు



మేము కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాం. మా పిల్లల విద్య అవసరాల కోసం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. అయితే ఆయా సర్టిఫికెట్లు ఎక్కడ పొందాలో తెలియక గందరగోళానికి గురయ్యాం. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్లు ఇస్తున్నారని తెలిసి సంతోషించాం. వలంటీర్లు మా యింటికి వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు ఇచ్చారు.

–శకుంతల, సాతులూరు

జగనన్న విద్యాకానుక సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు

నరసరావుపేట రూరల్: జగనన్న విద్యాకానుకను సద్వినియోగం చేసుకునేవిధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.వేణుగోపాలరావు తెలిపారు. మండలంలోని ములకలూరు జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం సందర్శించారు. విద్యార్థుల నోట్‌బుక్స్ తనిఖీ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు పరిశీలించి అపరిశుభ్రంగా ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు మరుగుదొడ్లను శుభ్రం చేయాలని ఆయాలకు సూచించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ప్రతి విద్యార్థి జగనన్న విద్యాకానుకలో ఇచ్చిన యూనిఫామ్, బూట్లు ప్రతిరోజు ధరించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయినులతో సమావేశం నిర్వహించారు. నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

చంద్రబాబు డైరెక్షన్.. పవన్ వ్యాఖ్యలు

- వలంటీర్లకు క్షమాపణలు చెప్పాల్సిందే
- ఎమ్మెల్యే గోపిరెడ్డి డిమాండ్



నరసరావుపేట: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు డైరక్షన్‌లోనే జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వలంటీర్లపై ఆరోపణలు చేశాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గతంలో వలంటీర్లు సంచులు మోయటానికా, ఇళ్లల్లో మగవారు లేనప్పుడు తలుపు తట్టడానికా అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యల మాదిరిగానే ఇప్పుడు పవన్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఆయన రాసిన స్క్రిప్ట్‌ను పవన్ చదువుతున్నాడని అర్థమౌతుందన్నారు. రాష్ట్రంలో 18వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని, దీనికి కారణం వలంటీర్లు అంటూ చెప్పటం దుర్మార్గమన్నారు. నిజంగా అదే జరిగితే రాష్ట్ర అల్లకల్లోలమయ్యేదన్నారు. వలంటీర్లలో అధికభాగం మహిళా వలంటీర్లే ఉన్నారనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. వలంటీర్లు స్వల్ప జీతంతో చాలా గొప్పగా ప్రజలకు సేవ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందుతున్నాయంటే అది సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు కారణమన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవలపై బ్రిటీషు హైకమిషనర్ ప్రశంసిస్తూ ఏ రాష్ట్రంలో జరగని విధంగా ప్రజలకు సేవలు వలంటీర్ల ద్వారా అందాయని చెప్పిన విషయం గుర్తు చేశారు. అలాంటి వారిని అవమానపర్చటాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అబద్ధాల అరవిందబాబు.. నిజాలు మాట్లాడు!

నరసరావుపేట: టీడీపీ ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు అబద్ధాల అరవిందబాబుగా మారి తనపై పూటకో అబద్ధం ప్రచారం చేస్తున్నాడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అతడు ఇటీవల ఆరోపిస్తున్నట్లుగా రెండు భూముల వ్యవహారంలో తనకెటువంటి సంబంధం లేదన్నారు. ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. తనకు అసెంబ్లీ సీటు కోసం తనపై లేనిపోని, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడన్నారు. దేవాలయంకు చెందిన భూములు, ప్రభుత్వ భూములు తాను ఆక్రమించి అమ్ముకున్నట్లుగా ప్రచారం చేస్తున్నాడన్నారు. కేసానుపల్లి గ్రామ సమీపంలోని రెండు ఎకరాల భూమి ప్రభుత్వ భూమిని తాను ఆక్రమించి అమ్ముకున్నట్లు చెప్పాడని, ఈ పట్టా భూమిని 1924లో గద్దే పెదవీరయ్య అనే వ్యక్తి కొనుగోలు చేశాడన్నారు.1924 నుంచి ఆయన స్వాధీనంలోనే ఉండగా 1970లో గద్దే అన్నమ్మ ఆమెపేరుపై నమోదైన ఆర్ఎస్ఆర్‌ను ఎమ్మెల్యే చూపించారు. 1984లో రంగా సత్యనారాయణకు విక్రయించాడన్నారు. 2002లో కనమర్లపూడి మల్లికార్జున గుప్తా పేరుపైకి మారిందన్నారు. ఆ భూమి పొరపాటున 2007లో డాటెడు ల్యాండ్‌గా రికార్డు అయిందన్నారు. 2002 నుంచి గుప్తా పొజిషన్‌లోనే ఉందన్నారు. ల్యాండ్‌ను కన్వర్టు చేసుకునేందుకు కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోగా కనమర్లపూడిపేరుపై ఎన్‌వోసీ ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు భూమి అతనిపేరుపై ఉండగా అతనే చదునుచేసుకొని, శుభ్రం చేసుకొని సాగు చేసుకుంటున్నాడన్నారు.

పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

- నిరసన వ్యక్తం చేసిన వలంటీర్లు
- కలెక్టరేట్ ముందు ధర్నా
- డీఆర్వోకు వినతిపత్రం సమర్పణ



కలెక్టరేట్ ముందు పవన్ ఫొటోలు ఉన్న పేపర్లను చీపుర్లతో కొడుతున్న వలంటీర్లు

నరసరావుపేట: తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు పవన్ కల్యాణ్‌పై వలంటీర్లు మండిపడ్డారు. చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరుతూ నియోజకవర్గంలోని వలంటీర్లు సోమవారం జిల్లా కలెక్టరేట్ ముందు కూర్చుని ధర్నా చేశారు. పవన్ కల్యాణ్ ఫొటో ఉన్న పోస్టర్లను చీపుర్లతో కొట్టి నిప్పుతో తగులపెట్టి నిరసన వ్యక్తం చేశారు. డౌన్ డౌన్ పవన్ కల్యాణ్, జనసేన, తక్షణమే అరెస్టు చేయాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డీఆర్వో కె.వినాయకంకు పవన్ కల్యాణ్‌పై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా పలువురు వలంటీర్లు మాట్లాడుతూ వలంటీర్లలో 60 శాతంకు పైగా ఉన్న మహిళలు ఉన్న వలంటీర్లు మహిళల ట్రాఫికింగ్‌కు పాల్పడుతున్నారంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మాటల్లోనే...


క్షమాపణ చెప్పాల్సిందే



తాము తెల్లవారుఝామునే ఐదుగంటలకే లేచి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు సేవ చేస్తున్న మహిళా వలంటీర్లను బ్రోకర్లు అంటూ మాట్లాడిన పవన్ కల్యాణ్ తమకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. చెప్పేవరకు మా నిరసన కొనసాగిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగిస్తాం.

– మహిళా వలంటీరు

వ్యక్తిత్వాన్ని దిగజార్చుకున్నాడు



గత నాలుగేళ్లుగా తాము ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాం. మా మహిళా వలంటీర్లను అవమానపరుస్తూ అసభ్యకరంగా పవన్ మాట్లాడి తన వ్యక్తిత్వాన్ని దిగజార్చుకున్నారు. స్వచ్ఛందంగా సేవలు చేస్తున్న మాపై వ్యాఖ్యలు చేసిన వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలి.

కేశవ్ కార్తీక్, వలంటీర్

పవన్‌వి దిగజారుడు రాజకీయాలు



పవన్ వ్యాఖ్య లు దిగజారుడు రాజకీయాలకు పరాకష్టగా చెప్పవచ్చు. ఒక ఎమ్మెల్యేగా గెలవలేని పవన్ వేరే రాష్ట్రంలో నివా సం ఉంటూ సేవలు చేస్తున్న వలంటీర్లను దూషించటం నీచ రాజకీయానికి నిదర్శనం. మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్ వితంతువులను కించపరుస్తూ మాట్లాడుతున్నాడన్నారు.

–సాయి, వలంటీరు, రామిరెడ్డిపేట

గొంతు కోశాడంటూ ఫిర్యాదు

నాదెండ్ల: ఓ వ్యక్తి తనను వేధిస్తూ గొంతు కోశాడంటూ అర్ధరాత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆవుల నరేంద్ర అనే యువకుడు గణపవరం ముప్వావారి వీధిలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. నాలుగేళ్ళ క్రిందట చిలకలూరిపేటకు చెందిన యల్లమ్మ అనే మహిళతో పరిచయం ఏర్పడి, ఇరువురూ గణపవరంలో సహజీవనం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం వీరిరువురూ, నరేంద్ర స్నేహితులైన గణేష్, మెకానిక్ శివలు కారులో గుంటూరు వెళ్ళారు. సాయంత్రం గణపవరం తిరిగి వచ్చే క్రమంలో యల్లమ్మ తన సోదరుడి వరుసయ్యే దుర్గాప్రసాద్‌కు ఫోన్ చేసి నరేంద్ర, అతని స్నేహితులు తనను వేధిస్తున్నారంటూ ఫోన్ చేసింది. వారు కారులో గణపవరం చేరుకునే సరికి అప్పటికే అక్కడకు వచ్చిన దుర్గాప్రసాద్ తన సోదరిని ఎందుకు వేధిస్తున్నారంటూ నరేంద్రతో వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపటికి యల్లమ్మను నరేంద్ర గొంతు కోశాడంటూ 108కు, పోలీసులకు సమాచారమిచ్చారు.

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం

వినుకొండ(నూజెండ్ల) : రాష్ట్రంలోని వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను నూజెండ్ల గ్రామంలో వి.అప్పాపురం వలంటీర్లు సోమవారం దగ్ధం చేశారు. ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వలంటీర్లు అందిస్తున్నారని, కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించిన వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు పెదచెరువు విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని ఆంధ్రా స్కూల్ విద్యార్థి వల్లెపు యజ్ఞేశ్వర్ రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎ.ఇందిరాదేవి సోమవారం తెలిపారు. గుంటూరులో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయి 50వ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్–2023 పోటీలో తమ విద్యార్థి యజ్ఞేశ్వర్ అండర్–11 విభాగంలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. యజ్ఞేశ్వర్‌ను కె.బి.ఆర్. విద్యాసంస్థల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డైరెక్టర్ కె.నరేంద్ర, కోచ్ డాక్టర్ బి.శరత్‌చందు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.శ్యామ్‌సుందర్, ఎం.రత్నరాజు అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధికే ప్రాధాన్యం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి: సంక్షేమంతో పాటు అభివృద్ధిని సైతం సమపాలల్లో అమలు చేస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని గుట్లపల్లి సచివాలయం పరిధిలోని గుట్లపల్లి, కంద్రిక గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సచివాలయం పరిధిలో 3,800 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 11.68 కోట్ల మేర సంక్షేమ పథకాలను అమలు చేశామని, సచివాలయ పరిధిలో నాడు–నేడు, స్వచ్ఛ భారత్, సచివాలయ, రైతు భరోసా, హెల్త్ సెంటర్ భవనాలు, తదితర అభివృద్ధి కార్యక్రమాలకు రూ.3.68 కోట్ల మేర పనులు జరిగాయన్నారు. దీంతో పాటు జలజీవన్ మిషన్‌లో భాగంగా లక్షల రూపాయలతో ఇంటింటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరికపూడిశెల నిర్మాణంతో మండలం సస్యశ్యామలమవుతుందని,త్వరలో ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని చెప్పారు. గత ప్రభుత్వాల హయాంలో ఏనాడైనా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారా, ఇది ప్రజలు గుర్తించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు సుభీక్షంగా ఉన్నారని, పేద, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమంలో ప్రాధాన్యత ఇచ్చారని, అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పాలనలో పెద్దపీట వేశారని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను దగ్గర చేయడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకై క ప్రభుత్వం తమదేనన్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు అభివృద్ధి పనులు చేయలేక తాము చేస్తున్న అభివృద్ధి పనులు అడ్డుకోవడమే పనిగా నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అంతా గమనిస్తున్నారని సరైన రీతిలో మరలా గుణ పాఠం చెబుతారన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్నివిధాలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహాయసహకారాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వై. కీర్తి, ఎంపీటీసీ ఎం.వెంకటరమణ, ఎంపీపీ బత్తి రాములు, జడ్పీటీసీ ఆర్.బీమ్లీబాయి, తహసీల్దార్ ఎ.వి. సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీవో జిలానీబాషా, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.